WWW.NTNEWS.COM

నవ్యాధ్యాయం 2018

హైదరాబాద్ ఆదివారం 4 నవంబర్ 2018 నమస్తే తెలంగాణ

వైటీడీఏ ద్వారా ఇప్పటి వరకు అయిన వ్యయం రూ. **600** కోట్లు

భూసేకరణకు: రూ. **109** కోట్లు

కొండపై ఆలయ నిర్మాణం: రూ. **211** కోట్లు

శిల్పులకు వెచ్చించింది: రూ. **142** కోట్లు

టెంపుల్ సిటీ కోసం : రూ. **89**కోట్లు

లడ్డూ ప్రసాదం తయారీ భవనం కోసం: రూ.**4.5** కోట్లు

గోశాల ఆధునీకరణ: రూ.**2.0** కోట్లు

వేతనాలు, ఇతర ఖర్చులు: రూ.**9** కోట్లు

రూ. 1900 కోట్ల ప్రణాళికా వ్యయంతో ఒకవైపు ఆలయనగరి, మరోవైపు వసతికోసం టెంపుల్ సిటీ నిర్మాణం పనులు వడివడిగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 1,000 కోట్ల రూపాయల పనులు జరిగాయి. ఆలయపునాది నుంచి రాజగోపురాల వరకు కృష్ణశిలలతో రూపొందుతున్న ఏకైక నిర్మాణంగా యాదాద్రి ఖ్యాతి గడించింది. ఫలితంగా అంతర్జాతీయంగా 'ఐఎస్‌వో' సర్టిఫికెట్ పొందింది. ఇలాంటి మొట్టమొదటి ఆలయంగా సరికొత్త చరిత్రను లిఖించింది.

సీఎం కేసీఆర్ సంకల్పబలానికి ప్రతీక

2000 ఏండ్లలోనే ఇదే బృహత్ శిల్ప కట్టడం

రూ. 1900 కోట్లతో భారీ నిర్మాణాలు | 2019 లోగా నిర్మాణాలన్నీ పూర్తి

అద్భుత దివ్యధామం యాదాద్రి

టీఆర్ఎస్ ప్రభుత్వం గత నాలుగేండ్లలో సాధించిన అనూహ్య ప్రగతిలో, అత్యంత ప్రధానమైన ఆధ్యాత్మిక సంచలనాలలో ఒకటిగా 'యాదాద్రి కొత్త ఆలయ నిర్మాణం' నిలుస్తున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనల నుంచి పురుడు పోసుకొని, దేశానికే మకుటాయమానం కాగల రీతిలో ఈ అద్భుత దివ్యధామం రూపొందుతున్నది. 2019 చివరికల్లా భక్తజనానికి అందుబాటులోకి రానున్న యాదాద్రి విశేషాలు..

గొట్టిపర్తి భాస్కర్‌గౌడ్, యాదాద్రి భువనగిరి జిల్లా, నమస్తే తెలంగాణ :

శ్రీ లక్ష్మీ నారసింహస్వామి దివ్యక్షేత్రంగా 2014 వరకు యాదగిరిగుట్ట పేరుతో విలసిల్లి, టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ఆలోచనలు, సంకల్పబలంతో 'యాదాద్రి'గా నామకరణం జరుపుకుని, అనూహ్యరీతిలో కొత్త ఆలయంగా రూపాంతరం చెందుతున్న ఈ అద్భుత దేవాలయం నిర్మాణపనులు అత్యంత వేగవంతంగా జరుగుతున్నాయి. ఘనమైన చారిత్రక, పౌరాణిక, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం గల యాదాద్రి కొత్త దేవాలయాన్ని ప్రపంచంలోనే కనీవినీ ఎరుగని రీతిలో, నాటి కాకతీయుల నిర్మాణ శైలిని అనుసంధానింపజేస్తూ నిర్మిస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దృఢసంకల్పం యాదాద్రి అణువణువునా అగుపిస్తున్నది. ఆయన ప్రత్యేక శ్రద్ధాసక్తులతో ఆలయ కట్టడాల పనులను ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్న తీరు నిజంగా ప్రశంసనీయం. ఈ నిర్మాణ పనులలో మూడు (తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ) రాష్ట్రాలకు చెందిన వందలాది మంది శిల్పులు పాలుపంచుకుంటున్నారు.

2000 ఏండ్లలో ఇదే బృహత్ శిలా దేవాలయం

యాదాద్రి మొత్తం ఆలయాన్ని పూర్తిగా శిలలతోనే నిర్మిస్తున్నారు. గత 2000 ఏండ్లలో ఈ తరహాలో ఇంతటి శిల్పసహిత బృహత్ ఆలయ కట్టడం మరొకటి లేదని చరిత్రకారులు అంటున్నారు. ఈ ప్రాజెక్ట్ వాస్తుశిల్పి ఆనంద్ సాయి. శిల్ప, ఆగమ శాస్త్రసూత్రాల ఆధారంగా, ప్రాచీన ప్రణాళికనంతా ఆసాంతం చాలా జాగ్రత్తగా అవగాహన చేసుకున్నాకే ఆయన కట్టడపు పనులను మొదలుపెట్టారు. ఇంత పెద్ద దేవాలయాన్ని మొత్తం రాతితోనే కాకతీయుల శైలి తరహాలోనే నిర్మిస్తుండటం ప్రపంచంలోనే అత్యంత అరుదు. ఆర్కిటెక్టు ఆనంద సాయి ఇచ్చిన డిజైన్లకు స్థపతులు ఎస్ సుందరరాజన్, డాక్టర్ ఆనందాచార్యుల వేలు పర్యవేక్షణలో అద్భుత శిల్పకళా

ఏడు గోపురాలు సిద్ధం

యాదాద్రి కొండపై ప్రధానాలయ ప్రాంగణంలో సాగుతున్న ఆలయ నిర్మాణ పనుల పురోగతితో ఆలయం రోజుకో కొత్తరూపుతో సందర్శకులను అలరిస్తున్నది. ఈ దివ్యక్షేత్రానికి శిల్పశోభను సంతరింపజేసే సప్తగోపురాల నిర్మాణ పనుల్లోని ఐదంతస్తుల ఉత్తర, తూర్పు, ఈశాన్య, అదే విధంగా గర్భాలయంపై విమాన గోపుర నిర్మాణం పనులు పూర్తయ్యాయి. పశ్చిమంలోని ఏడంతస్తుల మహారాజ గోపుర నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రాకార నిర్మాణంలోని అష్టభుజి మండప నిర్మాణంలో విశేషమైన బాలపాదం 13 స్తంభాలను ప్రతిష్ఠించారు. వీటిపైన సింహాలు, హంసలు, ఏనుగులు, లతలు, ఇతర మృగాలు, నరసింహ అవతారాలను శిల్పులు అందంగా మలిచారు. ఈ శిల్పకళా ఖండాలన్నీ సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఉపపీఠం కింద ఏనుగు, దాని పైన సింహమైతే అద్భుతంగా కుదిరాయి. ప్రాకారానికి నాలుగు వైపులా స్తంభాల పనులు పూర్తయితే మరింత ఆకట్టుకుంటుందని స్థపతులు సుందరరాజన్, డాక్టర్ ఆనందాచార్యుల వేలు చెబుతున్నారు.

యాదాద్రిలో వసతి సౌకర్యాలలో భాగంగా అత్యంత ఖరీదైన ప్రెసిడెన్షియల్ సూట్స్ నిర్మాణం పనులు ఊపందుకున్నాయి. ఒక్కో సూట్‌ను రూ. 7.5 కోట్లతో నిర్మిస్తున్నారు. 14 సూట్లకుగాను మొత్తం 105 కోట్లు వ్యయం కానున్నాయి. ఇప్పటి వరకు రూ. 33 కోట్లతో పనులు జరిగాయి. మొత్తం సూట్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇవన్నీ దాతల సహాయంతో నిర్మిస్తున్నారు. వైటీడీఏ అధికారులు డిజైన్లకు అనుగుణంగా సాగుతున్న పనులను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రపతి, లేదా ముఖ్యమంత్రి స్థాయి వీవీఐపీలకు వీటిని కేటాయిస్తారు.

విమాన గోపురానికి 30 కిలోల బంగారం!

ఇక్కడి గోపుర విమానం పంచతలం. అలాగే, శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దివ్యవిమాన గోపురానికి బంగారు తాపడం చేయడానికి అవసరమైన పనులను వైటీడీఏ వేగిరం చేసింది. అత్యాధునిక గోల్డ్ ఎలక్ట్రోప్లేటింగ్ విధానంలో, 30 కిలోల బంగారంతో పూర్తి చేయనున్నారు. గోపురాలకు విగ్రహాలు అమర్చే ప్రక్రియ కొనసాగుతున్నది. దక్షిణం రాజగోపురం పై కప్పు వరకు నిర్మితమైంది. పడమరలోని పంచతల గోపురం కర్ణకూటం లెవెల్ వరకు పనులు పూర్తయ్యాయి. ఇక, ప్రాకారం ప్రత్యేకతను సంతరించుకుంటున్నది. బాహ్యప్రాకారం, అష్టభుజి మండపాలు, స్తంభాలు, వాటిలో సొగసుగా ఒదిగిపోయిన బాలపాద స్తంభాలు, వాటికి అడుగుభాగాన గజమూర్తులు స్తంభాన్ని మోస్తూ కనువిందు చేస్తున్నాయి. పైన విగ్రహస్థానంలో అనేక రకాల విష్ణురూపాలు, హంసలు, పక్షులు, పులులు, సింహాలు, పుష్పాలు, లతలను ఎంతో అందంగా కృష్ణశిలలపై చెక్కారు. పెద్ద స్తంభంపైన అమర్చిన పుష్పపొదికలు శోభాయమానంగా భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ఆలయ నిర్మాణానికి మూడు రకాల శిలలను ఉపయోగిస్తున్నారు. గర్భగుడిలోని ప్రధాన దేవుళ్ల విగ్రహాలకు కృష్ణశిల (పురుష శిల)ను వాడుతుండగా, దేవతల శిల్పాల కోసం స్త్రీ శిలను వినియోగిస్తున్నారు. ఫ్లోరింగ్, గోడలు వంటి వాటి కోసం 'నపుంసక శిల'లను ఉపయోగిస్తున్నారు. తెలంగాణకు చెందిన కాకతీయుల కాలం నాటి దేవాలయ నిర్మాణాలకు మూలాధారమైన నల్ల గ్రానైట్ రాళ్లను ఆలయ ప్రాంగణానికి చెందిన ఆయా ప్రదేశాలలో వినియోగిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ రకమైన శిలల్లో చాలా సూక్ష్మరంధ్రాలుంటాయని, పాలు, పెరుగు, చమురు వంటి ద్రవపదార్థాలు వీటిలోకి చేరినపుడు ఈ ఘన శిలాద్రవ్యం మరింతగా దృఢపడుతుందని శిల్పులు అంటున్నారు.



2019 చివరి నాటికి పూర్తి

కొండపైన ఎక్కడ చూసినా వందలాది మంది శిల్పకళాకారులు, వారి ఉలుల శబ్దాలు, ఆ మేరకు అపురూప రూపాలను సంతరించుకుంటున్న శిల్పాలు, వీటికి తోడు భారీ క్రేన్లతో సాగుతున్న పనులు. ఒక జాతీయ ప్రాజెక్టును తలపించే భారీ దృశ్యం. పాత ఆలయ ప్రదేశంలోనే యాదాద్రి కొత్త దేవాలయ ప్రాంగణాలను నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాలన్నీ పూర్తయ్యే వరకు తాత్కాలికంగా భక్తుల కోసం 'బాలాలయం' నిర్మించారు. ప్రధాన దేవాలయాన్ని వచ్చే ఏడాది (2019) ముగిసేలోగా పూర్తి చేసే లక్ష్యంతో నిర్మాణ పనులను శరవేగంగా కొనసాగిస్తున్నారు. శ్రీవైష్ణవ వేదగురువు, విశిష్ఠ ఉపదేశకులైన ఆధ్యాత్మిక వేత్త త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి వారి ప్రత్యక్ష ఆశీస్సులతో అత్యంత ప్రామాణికంగా, ఆగమ శాస్త్రానుసారంగా వెలుస్తున్న యాదాద్రి అంతర్జాతీయ స్థాయిలో అపురూప పుణ్యస్థలాల్లో ఒకటి కానుందని ఇప్పటికే అనేకమంది ప్రశంసల వర్షం కురిపించారు. అయితే, ఈ ఘనత మొత్తం టీఆర్ఎస్ పార్టీకి నాయకత్వం వహిస్తున్న మన సీఎం కేసీఆర్‌కే చెందుతుంది. యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వైటీడీఏ) పర్యవేక్షణలో ఈ నిర్మాణ పనులు 2016లో ప్రారంభమయ్యాయి.

మరో కృష్ణదేవరాయలు మన సీఎం కేసీఆర్!

యాదాద్రిలో జరుగుతున్న నిర్మాణాలు అసాధారణం. రాజుల కాలంలో తాతలు ప్రారంభించిన పనులను మనుమలు, మునిమనుమలు పూర్తి చేసేవారు. ఆనాటి నిర్మాణాల కన్నా యాదాద్రి నిర్మాణాలు దేశంలోనే అత్యంత విశిష్టంగా ఉన్నాయి. తంజావూరులోని బృహదీశ్వరాలయం కన్నా ఉత్కృష్టంగా ఇక్కడ పనులు జరుగుతున్నాయి. ఆధ్యాత్మిక వేత్తలంతా సీఎం కేసీఆర్‌ను మరో కృష్ణదేవరాయలుగా పిలుచుకుంటున్నారు. యాదాద్రిలో శిల్పసంపదకు రూపురేఖలు ఇచ్చే అవకాశం నాకు లభించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

– స్థపతి సుందరరాజన్, యాదాద్రి

సిర్పూర్‌లో టీఆర్ఎస్ గాలి

యాతాలం చిన్నారెడ్డి, నిర్మల్,
నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి:



సిర్పూర్ (టీ) నియోజకవర్గం ప్రస్తుత కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో ఉన్నది. ఈ నియోజకవర్గంలో టీఆర్ఎస్ గాలి బలంగా వీస్తున్నది. కారణం, 2014లో బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన కోనేరు కోనప్ప తదనంతరం టీఆర్ఎస్‌లో చేరడంతో పరిస్థితి పూర్తిగా ఈ పార్టీకి అనుకూలంగా మారింది. ఈ నియోజకవర్గం ఒకప్పుడు కాంగ్రెస్, టీడీపీకి కంచుకోటగా ఉండేది. 1952లో ఏర్పడిన ఈ నియోజకవర్గానికి మొత్తం 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇక్కడ ఆరుసార్లు కాంగ్రెస్, రెండుసార్లు టీడీపీ గెలిచాయి. స్వతంత్ర అభ్యర్థిగా పాల్వాయి పురుషోత్తమరావు 1989, 1994లో రెండుసార్లు విజయం సాధించారు. 2009, 2010లో కావేటి సమ్మయ్య టీఆర్ఎస్ అభ్యర్థిగా గెలుపొందారు. 2004లోనే కోనేరు కోనప్ప కాంగ్రెస్ నుంచి తొలిసారి ఎమ్మెల్యే కాగా, తిరిగి 2014 ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసి రెండోసారి ఎమ్మెల్యే అయ్యారు. ఆ తర్వాత ఆయన టీఆర్ఎస్‌లో చేరారు. తాజాగా టీఆర్ఎస్ అభ్యర్థిగా కోనేరు కోనప్ప ఇక్కడ్నించి బరిలో ఉన్నారు.

2011 లెక్కల ప్రకారం జనాభా 2,76,142

- గ్రామీణ జనాభా: **54.49%**
- పట్టణ జనాభా: **45.51%**
- ఎస్సీలు: **30.26%**
- ఎస్టీలు: **6.08%**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ 2018 ప్రకారం..

- ఓటర్లు: **1,79,292**
- పురుషులు: **91,016**
- స్త్రీలు: **88,245**
- ఇతరులు: **31**

2014 ఎన్నికల ఫలితాలు

- **49,033**(32.41%) బీఎస్పీ
- **40,196**(26.57%) టీఆర్ఎస్
- **26,955**(17.82%) కాంగ్రెస్

పోలింగ్: **79.37%**

విజేత: కోనేరు కోనప్ప (బీఎస్పీ)
మెజారిటీ : 8,837ఓట్లు
రెండోస్థానం: కావేటి సమ్మయ్య (టీఆర్ఎస్)

అభివృద్ధిలో పరుగులు

ఈ నియోజకవర్గంలో టీఆర్ఎస్ పలు అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టించింది. సిర్పూర్ పేపర్ మిల్లును తెరిపించేందుకు కోనప్ప విశేష కృషిని ప్రజలు వేనోళ్లా గుర్తుంచుకుంటున్నారు. ప్రాణహిత నదిపై రూ.65 కోట్లతో చేపట్టిన వంతెన నిర్మాణం ఎంతో ఉపయోగపడుతున్నది. విద్య, వైద్య సదుపాయాలు కల్పనలోనూ విశేష కృషి జరిగింది.

దూసుకుపోతున్న కోనప్ప

నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లో తమ పార్టీపట్ల సదభిప్రాయాన్ని కలిగిస్తున్నాయని ఇక్కడి టీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి. టీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప విస్తృత ప్రచారం చేస్తున్నారు. విజయం

మాటకు మాట!

ఎవడెన్ని లెక్కలేసుకున్నా పర్వాలేదు. భయమేమీ లేదు. ఇక్కడ మా లెక్క మాకు ఉన్నది. సారు+కారు=సర్కారు. బస్ అంతే!

- లక్ష్మణ్ బందూక్

పాపం.. టీడీపీ, చంద్రబాబు నాయుడి అభిమానుల్ని చూస్తుంటే జాలేస్తుంది. ప్రతిరోజూ లేవగానే ఆత్రంగా పేపర్ చూసుకోవాలేమో? ఏ రోజు ఏ పార్టీకి సపోర్ట్ చేస్తున్నామో తెలుసుకోవడానికి!

-కిరణ్‌కుమార్

ఒంటరిగా పోటీచేస్తే కాంగ్రెస్సోళ్లకు డిపాజిట్లన్నా వచ్చేవి. బాబుతో పొత్తు వల్ల ఆ డిపాజిట్లు కూడా కష్టమే!

- బుచ్చిబాబు కేపీ

ముప్పై ఐదేండ్ల కింద తప్పిపోయిన కొడుకు మళ్లీ తల్లిదగ్గరకు చేరితే.. ఆ ఆనందమే వేరు. అందుకే వీణలు మోగుతున్నాయి!

- తిరుమల్‌రెడ్డి సుంకరి



తెలంగాణలో నాలుగేండ్లుగా పుల్లలు పెట్టుకుంటూ కూసున్నది కేవలం ఢిల్లీలో సెల్ఫీల కోసమా అని గుణుగుతున్న అనుచరులు.. అని గుసగుస వినిపిస్తున్నది!

- ధాము నర్మాల

ఇంటర్వ్యూ..

ఆర్డీఎస్ వాటాకోసం కృషి చేస్తా

'అలంపూర్ నియోజకవర్గంలో ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నది. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిస్తే ఆర్డీఎస్ వాటా కోసం కృషి చేస్తా. విద్య, వైద్య సౌకర్యాలను మెరుగుపరుస్తా' అంటున్న అలంపూర్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లూరు మల్లెపోగు అబ్రహాంతో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూ

–అలంపూర్, నమస్తే తెలంగాణ

ప్రచారంలో ప్రజల మద్దతు ఎలా ఉన్నది?

అద్భుతంగా కొనసాగుతున్నది. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. నేను టీఆర్ఎస్‌లో చేరాక చాలామంది మిత్రులు ఏర్పడ్డారు. వారి సాయంతో కలిసికట్టుగా ప్రచారం నిర్వహిస్తున్నాం. కార్యకర్తలందరినీ కలుపుకొని ముందుకు వెళ్తున్నాం. పార్టీకి ప్రజల మద్దతు సంపూర్ణంగా లభిస్తున్నది. గతంలో ఏ పార్టీ కూడా చేయని అభివృద్ధిని టీఆర్ఎస్ చేసింది. వాటి ప్రతిఫలాల్ని ప్రజలు అందుకుంటున్నారు. ఏ నాయకుడూ అందించని పరిపాలనను సీఎం కేసీఆర్ అందించారు.

ఎమ్మెల్యేగా గెలుపొందాక ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారు?

అలంపూర్ నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడింది. ఇప్పటికే టీఆర్ఎస్ ప్రభుత్వం తుమ్మిళ్ల ప్రాజెక్టును మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టుతో దాదాపు 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతున్నది. ఇంకా ఆర్డీఎస్ నుంచి మనకు రావాల్సిన నీటి వాటాను దక్కించుకునేందుకు ఎమ్మెల్యేగా గెలుపొందాక నా వంతు కృషి చేస్తా. ఇక్కడి ప్రజలు విద్య, వైద్య సౌకర్యాల విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. వాటిని నెరవేర్చేందుకు చర్యలు చేపడుతా.

మహాకూటమిపై మీ స్పందన?

ఈ కూటమిని ప్రజలు నమ్మే స్థితిలో లేరు. కాంగ్రెస్, టీడీపీ తెలంగాణలో చేపట్టని అభివృద్ధిని పార్టీ ఈ నాలుగేండ్లలోనే చక్కగా చేపట్టింది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఏ నాయకుడు మేలు చేశాడో, ఎవరు చేయలేదో అన్నీ వారికి తెలుసు. రేపటి ఎన్నికల్లో ప్రజలు ఓటుతో సమాధానం చెప్తారు.